# శివరాత్రి చిద్విలాసం

"రేపు శివరాత్రి కదండీ!"

భర్త ఆఫీసు నుండి రాగానే వేడి వేడి కాఫీ అందిస్తూ కాటుక కళ్లను గమ్మత్తుగా తిప్పేసింది కామాక్షి.

"ఐతే ఏమిటటా!" ఒక చేత్తో కాఫీ కప్పందుకుంటూ మరో చేత్తో భార్య బుగ్గమీద చిటికేసి సోఫాలో సెటిలై పోయాడు కాంతారావు.

తియ్యని అనుభూతిలోంచి తేరుకుని "అబ్బే అది కాదండీ!" భర్త పక్కన కూచుంది.

"శివరాత్రినాడు ఉపవాసం చేస్తే కాశీలో గోవును దానం జేసినంత పుణ్యమట. రేపు మనం ఉపవాసం ఉందామండీ" లాలనగా భుజమ్మీద చెయ్యేసింది.

"అంటే ... .!" ఐసై పోతున్నాడు కాంతారావు.

"రేపు మనం భోజనం మానేసి ఒక్కపూట టిఫిన్‌తో సరిపెట్టుకోవాలి! ఆ తర్వాత రాత్రికి దైవస్మరణచేస్తూ జాగారం చెయ్యాలి"

గులాబ్‌జామ్ తింటూంటె గులకరాయి పంటికింది కొచ్చినట్టె కాంతారావుకు కంపరమెత్తింది.

"కొత్తగా పెళ్ళయిన వాళ్ళం గదా! ఇప్పట్నుంచే ఆ మహాయజ్ఞం మనకెందుకూ?"

"ఇప్పుడు కాకపోతే వయసుడిగి పళ్ళూడింతర్వాతనా? అప్పటిదాకా బతుకుతామనే గ్యారంటీ ఏమిటీ? బతికున్నప్పుడే బలుసాకంత పుణ్యం మూట గట్టుకోవాలిగదా."

ఆచార్య వ్యవహారాల గురించి, ఉపవాసం వల్ల లాభాల గురించి ఉపన్యాసం మొదలైంది

ఉపన్యాసాలు వినడం కంటే ఉపవాసముండడమే మేలనిపించి తలూపేశాడు కాంతారావు.

రిక్షాలో జంటగా బజారుకెళ్ళారు.

కందగడ్డ, మూడు రకాల పండ్లు, సత్తుపిండి సామాగ్రి, పూజా సామాగ్రి కొనుక్కుని ఆటోలో తిరిగొచ్చేసరికి వందనోటుకు రెక్కలొచ్చి ఎగిరి పోయింది. ఆటో దిగుతూ...

"చూశావా, నువ్వంటే నాకెంతో ప్రేమో" అన్నట్టుగా నవ్వేశాడు

కామాక్షి మురిసిపోయింది.

తెల్లవారింది. శివరాత్రి. ఆఫీసుకు సెలవు. ఉపవాస దీక్ష ప్రారంభమైంది.

పదయింది. కడుపులో చిట్టెలుకలు పరుగులు తీస్తున్నాయ్ తట్టుకోవడం అసాధ్యమైపోతోంది. కాంతారావుకు.

భర్యా భర్తల మధ్య ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో చర్చ జరిగింది ఉపవాసాల నిబంధనల్లో స్వల్పమైన సడలింపు జరిగింది. కాఫీ కడుపులోకి జారుకుంది.

మూతి తిప్పుళ్ళూ, మోచేతి పొతుపుల మధ్య శివపూజ కార్యక్రమం పూర్తయ్యేసరికి మధ్యాహ్నం రెండైంది. ఆకలి కేకలు ఆకాశాన్నంటుతున్నై.రెండో దఫా చర్చా కార్యక్రమం ప్రారంభిద్దామన్నాడు కాంతారావు

"నాలుగయ్యేదాకా మౌనవ్రతం పాటించాలి. అందాకా మీరు మాట్లాడితే నన్ను చంపుకు తిన్నంత ఒట్టు."

కామాక్షి పరమేశ్వరి అవతారమెత్తింది శివలీలలు పుస్తకం భర్త చేతికిచ్చింది.

సాయంత్రం నాలుగైంది

"ఆకలి కాగలేను చలో కామాక్షి!"

ఎండకువాడిన పండుటాకులా సోఫాలో వాలిపోయాడు

ఐదింటికి పండ్లూ, కంద గడ్డలూ, సత్తుపిండీ. ఆరగింపు జయప్రదంగా ముగిసింది

"జాగరణ సరిగా చెయ్యకపోతే ఉపవాస దీక్షా ఫలితం దక్కదు.ఒక వీ.సి పీ. మూడు భక్తి సినిమా క్యాసెట్లు పట్టుకురండి"

బజార్లో వీ.సీ.పీ షార్టేజి ఊరంతా గాలిస్తే వంద రూపాయల అద్దెకు దొరికింది వీ.సీ.పి. లో సినిమా షురువైంది. వానాకాలం చెరువులోకి కప్పలా పక్కింటి జనాలు బిలబిల మంటూ వచ్చేశారు. వాళ్లందర్నీ సాదరంగా ఆహ్వానించి కూచోబెట్టింది కామాక్షి.

భూకైలాస్ దక్షయజ్ఞం, పార్వతీ కళ్యాణం సిన్మాలు ముగిసే సరికి ఉదయం నాలుగైంది

తెల్లారే సరికి స్నానాదులు ముగిస్తే సరి. జాగరణ దిగ్విజయం. అనుకుంటూ లేచింది కామాక్షి.

అవులిస్తూ వెళ్లిపోయారు జనాలు.

"ఇహలేచి మొహం, స్నానాదులు, కానివ్వండి. మహానుభావా!"

సోఫాలో ఒరిగి కూచున్న భర్తపక్కన జేరి కళ్లలో కళ్ళు కలపబోయింది కామాక్షి.

గుర్ర్ర్.... గుర్ర్ర్ ... గురకలయబద్ధంగా వినిపిస్తోంది.

(అమృత్ కిరణ్ - 16-2-1995)